దక్షిణ కాశీ సంగమేశ్వరం

- మహాశివరాత్రికి ముస్తాబుతున్న ఆలయాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

మండపేట: ముక్కంటి మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. శనివారం శివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలో దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన ఏడిద సంఘమేశ్వరాలయంలో ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. ఏడిదకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సంఘమేశ్వరంలోని శివలింగం ఇంద్రుడు ప్రతిష్ఠించినట్టుగా పురాణాలు చెబుతున్నాయి. తుల్యభాగ, భరద్వాజ నదులు అంతర్వాహినులని, రెండు నదుల సంగమమైన ప్రదేశంలో ఈశ్వరుడు కొలువై ఉన్నందున ఈ శైవక్షేత్రానికి సంగమేశ్వరమని పేరు వచ్చిందని పెద్దలు చెబుతుంటారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన కదంబ వృక్షాలు ఈ క్షేత్రంలో కనిపిస్తాయి. ఆలయంలో సంగమేశ్వరునితో పాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సూర్యనారాయణమూర్తి, వేణుగోపాలస్వామి కొలువై ఉన్నారు. విశాలమైన ఆలయ ఆవరణ, కోనేరు, చుట్టూ పంటపొలాలతో ఈ ప్రాంతం ఆధ్యాత్మికంగానే, ఆహ్లాదకరంగా ఉంటుంది. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున తరలివచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఒకే గర్భగుడిలో రెండు శివలింగాలు

పట్టణంలోని రథం గుడిలో వేంచేసి ఉన్న అగస్త్యేశ్వరస్వామి, కై లాసేశ్వరస్వామి వార్లకు పురాణ ప్రాశస్త్యం ఉంది. వాతాపి అనే రాక్షసుడిని సంహరించిన అగస్త్య మహర్షి పాప పరిహారం కోసం తాపేశ్వరం, అర్తమూరు, వల్లూరు, మండపేట, చెల్లూరు గ్రామాల్లో శివలింగాలను ప్రతిష్ఠించినట్టు పురాణ ప్రతీతి. 17వ శతాబ్దంలో మండపేటలో అగస్త్యేశ్వర, జనార్దనస్వామి వారి ఆలయాల నిర్మాణం కోసం పెద్దాపురం మహారాజు సూర్యనారాయణ తిమ్మజగపతివర్మ తవ్వకాలు చేయిస్తుండగా ఈ శివలింగం బయటపడింది. ఈ శివలింగం విశిష్టతను గుర్తించిన మహారాజు దాని వెనుకనే తాను తీసుకువచ్చిన శివలింగాన్ని ప్రతిష్ఠించారు. అగస్త్యేశ్వర, కైలాసేశ్వర స్వాములుగా పూజలందుకుంటున్నారు.

చంద్ర ప్రతిష్ఠితాలు.. సోమేశ్వరాలయాలు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం, వెంటూరు గ్రామాల్లో ఉన్న సోమేశ్వరాలయాలు చంద్రుడి ప్రతిష్ఠతో వెలసిన ఆలయాలుగా ప్రాముఖ్యత పొందాయి. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న ఈ రెండు ఆలయాలలో ద్రాక్షారామ భీమేశ్వరునికి వాయువ్యాన సోమేశ్వర ఆలయం, పడమట దిక్కున వెంటూరు ఆలయం ఉన్నాయి. చంద్రుడు ప్రతిష్ఠ చేసిన ఆలయాలుగా చెప్పబడే కథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. ద్రాక్షారామలో స్వయంభవుడిగా వెలసిన భీమలింగాన్ని ప్రత్యక్ష సాక్షి సూర్యభగవానుడు ప్రతిష్ఠించి ప్రథమార్చన గావించినట్టు పురాణాల వల్ల తెలుస్తుంది. అంతర్వాహినిగా ఉన్న సప్తగోదావరి పుష్కరిణిలోని పవిత్ర జలంతో సప్తరుషులు స్వామిని అభిషేకించారు. సూర్య ప్రతిష్ఠ కారణంగా భీమేశ్వరునిలో నెలకొన్న ఉగ్రతాపాన్ని ఉపశమింపజేయడానికి ఆగమ సంప్రదాయం ప్రకారం దిక్కులందే కాకుండా విదిక్కులందు కూడా అష్ట సోమేశ్వరాలయాలను చంద్రుడు ప్రతిష్ఠించినట్టుగా చెబుతారు.


మండపేట రథం గుడిలో కొలువై ఉన్న అగస్త్యేశ్వర, కైలాసేశ్వర స్వామివార్లు


ఏడిద సంగమేశ్వరంలో కొలువైన సంగమేశ్వరుడు


వెంటూరులో ఉమా సోమేశ్వరస్వామి


సోమేశ్వరంలోని బాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి

ముస్తాబవుతున్న ఆలయాలు

ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సోమేశ్వరాలయాలతో పాటు, పలు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో ఏటా వర్తక సంఘం ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయంలో పంచాయతన మహా రుద్రయాగం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఏడాది మరింత ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాయవరం పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం జ్యోతిర్లింగార్చన, మహన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకం, సహస్రనామార్చన పూజలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పసలపూడి, వి.సావరం, చెల్లూరు, మాచవరం శివాలయాల్లో కూడా శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

శివరాత్రికి సర్వం సిద్ధం

- నేటి రాత్రి నుంచి భక్తుల తాకిడి
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- వీఐపీ దర్శనాలు రద్దు

కె.గంగవరం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యక్షేత్రం కోటిపల్లిలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గౌతమీ గోదావరి పుష్కర ఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా గత ఈతగాళ్లను సిద్ధం చేశారు. పడవలతో గస్తీ నిర్వహించనున్నారు. ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులకు మంచినీరు అందించే ఏర్పాటు చేశారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకం కలగకుండా ఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది కూడా వీఐపీ దర్శనాలు రద్దు చేశారు. పుణ్యస్నానాల అనంతరం స్వామి వారి దర్శనానికి మూడు రకాల ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని దగ్గరగా దర్శించుకునేందుకు శీఘ్రదర్శనానికి రూ.100, ప్రత్యేక దర్శనానికి రూ.20తో పాటు, ఉచితం దర్శనాలు కూడా కల్పించనున్నారు. క్యూలైన్ల వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేసి, భక్తులకు ఎండ తగలకుండా టెంట్లు ఏర్పాటు చేశారు.


కోటిపల్లి ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలు, టెంట్లు

మహా శివరాత్రి సందర్భంగా ఆలయం వెలుపల, లోపల, గ్రామంలోను ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. 20 మంది పంచాయతీ కార్యదర్శులు, 50 మంది సచివాలయ సిబ్బందిని రేవు వద్ద, ఆలయం వద్ద, పార్కింగ్ వద్ద నియమించామని వివరించారు. వీరితో పాటు 80 మంది పారిశుధ్య కార్మికులను కూడా నియమించామని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గ్రామంలోని నిత్యాన్నదాన పైడా సత్రం, సత్యసేవ సంస్థలు, కమ్మ సంఘం, ఆర్యవైశ్య సంఘం, వెల్ల గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ, బ్రహ్మ సంఘం వంటి వాటి ఆధ్వర్యాన అన్నదానం చేయనున్నారు. ఆలయానికి వచ్చిన ప్రతి భక్తునికీ భోజన సదుపాయం కల్పించనున్నారు.

వైభవంగా కాశీ విశ్వేశ్వరస్వామి కల్యాణం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈఓ పీటీవీవీ సత్యనారాయణమూర్తి (తారకేశ్వరరావు) నేతృత్వంలో దేవులపల్లి ఫణిరామకృష్ణ, దేవస్థానం వైదిక బృందం బ్రహ్మత్వంలో కన్నుల పండువగా కల్యాణం జరిగింది. స్వామి, అమ్మవార్లకు ఈఓ తారకేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించారు.


పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేస్తున్న ఈఓ తారకేశ్వరరావు దంపతులు

సంఘటిత కృషితోనే సమస్యల పరిష్కారం

కాజులూరు: ఏ వ్యవస్థలోనైనా సంఘటిత కృషితోనే సమస్యలు పరిష్కారమవుతాయని మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు అన్నారు. మండల స్థాయి శెట్టిబలిజ సంక్షేమ సంఘం సమావేశం కాజులూరు శివారు చాకిరేవు మెరక రామాలయం ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో అత్యధిక సంఖ్యాకులుగా ఉన్న శెట్టిబలిజలు ఐక్యత లోపించటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సభ్యులందరూ సంఘటితంగా వ్యవహరించి సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, కుయ్యేరు ఎంపీటీసీ సభ్యుడు చీకట్ల సత్యనారాయణ, సంఘ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొనసాగిన మహా రుద్రయాగం

రాయవరం: సోమేశ్వరంలోని చారిత్రక బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో పంచాయతన మహా రుద్రయాగం ఐదో రోజు గురువారం కొనసాగింది. ఈ నెల 12న ప్రారంభమైన మహా రుద్రయాగం 23వ తేదీ వరకు 12 రోజుల పాటు కొనసాగనున్న విషయం పాఠకులకు విదితమే. బ్రహ్మశ్రీ చంద్రాభట్ల రఘురామశర్మ ఆధ్వర్యంలో 100 మంది వేద పండితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలల్లో వేద పండితులు యాగాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నేత తోట పృథ్వీ ఆలయంలో జరుగుతున్న రుద్రయాగంలో పాల్గొన్నారు. రుద్రయాగ కమిటీ పృథ్వీని ఘనంగా స్వాగతించారు. సోమేశ్వరం, పరిసర గ్రామాలతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రుద్రయాగంలో పాల్గొన్నారు. రుద్రయాగ కమిటీ ఆధ్వర్యంలో యాగానికి హాజరైన భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు.


వైఎస్సార్‌సీపీ యువ నేత తోట పృథ్వీని స్వాగతిస్తున్న రుద్రయాగ కమిటీ

పోలీసులమంటూ టోకరా

- కేదారిలంకలో ఘటన
- ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

కపిలేశ్వరపురం: తాము పోలీసులమంటూ కొత్తపేటకు చెందిన యూట్యూబ్ చానల్ విలేకరులు ముగ్గురు కోడిపందేలు ఆడేందుకు సన్నద్ధమవుతున్న ఇద్దరిని బెదిరించి పందెం కోళ్లను ఎత్తుకెళ్లిన ఘటన కపిలేశ్వరపురం మండలం కేదారిలంకలో జరిగింది. ఈ నెల 14న జరిగిన ఈ ఘటనలో నిందితులైన ముగ్గురు విలేకరులను గురువారం అంగర పోలీసులు అరెస్టు చేసి ఆలమూరు కోర్టులో హాజరుపర్చారు. ఎస్సై చంటి కథనం ప్రకారం.. 14న కేదారిలంక శివారులో కోడి పందేలు ఆడేందుకు అదే గ్రామానికి చెందిన పురుషోత్తం, శివదుర్గా సాయిరాం చెరొక కోడిని తీసుకుని బయలుదేరారు. ఇంతలో యూట్యూబ్ విలేకరులు కొత్తపేటకు చెందిన ఇల్లా విక్రమరావు, రేలంగి ఆంజనేయులు, గొల్లపల్లి సూరిబాబు తాము పోలీసులమంటూ కర్రలతో వారిని బెదిరించి రెండు కోళ్లను, రూ.వెయ్యి నగదును లాక్కొన్నారు. ఎవరికైనా చెబితే బలమైన సెక్షన్లతో కేసులు బనాయిస్తామని, చంపేస్తామని బెదిరించారు. వారు పోలీసులు కాదని తెలుసుకున్న పురుషోత్తం 15న కొత్తపేట పోలీసులను ఆశ్రయించాడు. వారు విచారించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని ఘటన పరిధికి చెందిన అంగర పోలీసులకు అప్పగించారు. కాగా ముగ్గురు నిందితులపై మోసగించిన కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చంటి తెలిపారు.

కోటిపల్లి నుంచి వాడపల్లికి రేపు ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటిపల్లి నుంచి వాడపల్లికి శనివారం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు గురువారం విలేకరులకు ఈ విషయం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రతి గంటకు ఒకటి చొప్పున వాడపల్లికి బస్సులు నడుపుతామన్నారు. కె.గంగవరం, పామర్రు, టేకి, అంగర, కొత్తూరు సెంటర్, ఆలమూరు, రావులపాలెం మీదుగా ఈ బస్సులు నడుస్తాయని వెంకటేశ్వర్లు తెలిపారు.


ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

కోలాహలంగా సంగమేశ్వరుని రథోత్సవం

మండపేట: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏడిదలోని స్వయంవర పార్వతీ సంగమేశ్వరస్వామి వారి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ మధ్యాహ్నం రెండు గంటలకు రథోత్సవం మొదలైంది. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి రథాన్ని గ్రామంలోకి తీసుకువచ్చారు. దాదాపు రెండు కిలోమీటర్లు మేర సాగిన వేడుకలో ఏడిదతో పాటు వై.సావరం, ఏడిద కొత్తూరు, ఏడిద సీతానగరం, మండపేట, కడియం మండలంలోని దుళ్ల తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రాత్రికి స్వామివారి కల్యాణ వేడుక కన్నుల పండువగా సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ వేడుకను తిలకించారు. గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్ సీపీ నేత పలివెల సుధాకర్ పాల్గొన్నారు.


రథోత్సవంకు తరలివచ్చిన భక్తులు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కపిలేశ్వరపురం: మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలోని సత్యనారాయణపురం అగ్రహారంలోని టీడీపీకి చెందిన సుమారు 160 మంది మత్స్యకారులు గురువారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారిలో అధికంగా మహిళలు ఉన్నారు. సత్యనారాయణపురానికి చెందిన పార్టీ నాయకురాలు అరదాని శ్రీదేవి ఆధ్వర్యంలో వారంతా వెంకటాయపాలెంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో పార్టీలో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పాలనకు, క్షేత్ర స్థాయి సమస్యలపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పందిస్తున్న తీరుకు ఆకర్షితులై తామంతా వైఎస్సార్ సీపీలో చేరినట్టు వారు తెలిపారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఎమ్మెల్సీ తోట ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో టి.త్రినాథ్, కె.మీరయ్య, ఎస్.వీరలక్ష్మి, కె.రత్నకుమారి, వి.స్వరూప, వి.వీరవేణి, ఎస్.ముత్యాలు, ఆర్.భవాని, వి.విజయ, టి.మంగ, పి.రమణ, పి.అనసూయ, ఎస్.ఆదిలక్ష్మి, ఎస్.భాగ్యలక్ష్మి, ఎస్.రాజు ఉన్నారు.


వెంకటాయపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట, అరదాని శ్రీదేవి

నేడు ఇంటర్ విద్యార్థులకు 'పర్యావరణ విద్య' పరీక్ష

రాయవరం: ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు శుక్రవారం పర్యావరణ విద్యపై పరీక్షను నిర్వహించనున్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, రెసిడెన్షియల్, ఒకేషనల్ కళాశాల విద్యార్థులు ఈ పరీక్షను రాయనున్నారు. నైతిక విలువలు-పర్యావరణం పరీక్షను ఫస్టియర్ విద్యార్థులకు ఒక సబ్జెక్టుగా ఉంది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఇంటర్ సెకండియర్ పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ పరీక్ష ఉత్తీర్ణత సాధించకుంటే, ఇంటర్ సెకండియర్ పాస్ అయినప్పటికీ ఉత్తీర్ణత సాధించినట్లుగా సర్టిఫికెట్‌ను జారీ చేయరు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ఫస్టియర్‌కు చెందిన 13,578 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ప్రతి కళాశాలలో పరీక్ష నిర్వహించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియేట్ విద్య డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి తెలిపారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఆదేశాలను కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు జారీ చేశామన్నారు.

సర్వం సిద్ధం

కొత్తపేట: శని త్రయోదశి, మహా శివరాత్రి పర్వదినాల సందర్భంగా మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి క్షేత్రంలో పూజలు, తైలాభిషేకాలు, భక్తుల సౌకర్యాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. రెండు దశాబ్దాల తరువాత మహా శివరాత్రి, అమావాస్య ముందు శని త్రయోదశి పర్వదినాలు శనివారం కలిసి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మందపల్లి శనైశ్చర క్షేత్రానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు క్షేత్రానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా పూజలు, తైలాభిషేకాలు జరిపించి, స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లేలా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్‌డీఓ ఎం.ముక్కంటి పర్యవేక్షణలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు ఆధ్వర్యాన దేవస్థానం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆర్‌డీఓ ముక్కంటి పరిశీలించారు.

- ఇటీవల అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామివారి కల్యాణోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన ఆ దేవస్థానం ఈఓ వి.సత్యనారాయణను మందపల్లి క్షేత్రంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్(సీఎఫ్‌ఓ)గా నియమించారు.
- భక్తులు అభిషేక పూజలు నిర్వహించే స్థలాల్లో షామియానాలు, విద్యుత్ సౌకర్యం, స్నానాల రేవుల వద్ద భద్రతా చర్యలతో పాటు రేవుకు ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్లను నియమించారు.
- గట్లపై జల్లు స్నానాలకు పైపులైన్లు, దుస్తులు మార్చుకునేందుకు సైడ్‌వాల్స్‌తో షెడ్లు ఏర్పాటు చేశారు.
- తొక్కిసలాటకు అవకాశం లేకుండా బారికేడ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.
- ఒక్కో యూనిట్‌కు 12 చొప్పున మూడు ప్రాంతాల్లో 36 మొబైల్ టాయ్‌లెట్స్ ఏర్పాటు చేశారు.
- పవర్ ప్లాంట్ స్థలం, రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు నిర్దేశించారు.
- నియోజకవర్గంలోని వివిధ పీహెచ్‌సీల ద్వారా 5 ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.
- ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 2 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేశారు.
- తైలాభిషేకం, దర్శనానికి సంబంధించి వీఐపీలు, వీవీఐపీలకు ఒక క్యూ, సాధారణ భక్తులకు మూడు క్యూలు ఏర్పాటు చేశారు.
- రావులపాలెం వైపు నుంచి కోనసీమకు, అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్లే ఆర్టీసీ, ఇతర వాహనాలను ఈతకోట, పలివెల మీదుగా మళ్లించనున్నారు.
- భక్తుల సౌకర్యార్థం రావులపాలెం నుంచి మందపల్లి క్షేత్రానికి 10 ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.
- డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యాన కోనసీమలోని వివిధ స్టేషన్ల నుంచి పోలీసు అధికారులతో పాటు 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా శంకరనారాయణ స్వామి కల్యాణం


కల్యాణమూర్తులు శ్రీ ఉమాదేవీ సమేత శ్రీ శంకరనారాయణస్వామి

రామచంద్రపురం రూరల్: చిన్న తాళ్లపొలం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమాదేవీ సమేత శ్రీ శంకరనారాయణస్వామి వారి కల్యాణోత్సవాన్ని సంపర అనంత వెంకట వేణుగోపాలాచార్యులు బ్రహ్మత్వంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మట్టపర్తి ఉమా మహేశ్వరరావు, ఉమాదేవి దంపతుల చేతుల మీదుగా కల్యాణ క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. గణపతి పూజ, పుణ్యాహవాచనం, కన్యాదానం, మంగళసూత్రధారణతో కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. కల్యాణ వేడుకలో సర్పంచ్ కట్టా గోవిందు, భక్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మెరక పనులు


పనులను పరిశీలిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: నేలటూరు జగనన్న కాలనీ లేఅవుట్-1లో గురువారం గ్రావెల్‌తో మెరక పనులను చేపట్టారు. పనులను పంచాయతీరాజ్ జేఈ రాఘవులు పరిశీలించారు. పనుల నిర్వహణపై సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నిమ్మకాయల పద్మరాజుకు పలు సూచనలు చేశారు.

40 మందికి కంటి పరీక్షలు


టేకిలో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు


కపిలేశ్వరపురం: టేకిలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా 40 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. పారామెడికల్ ఆప్తాలమిక్ అసిస్టెంట్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి 30 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారికి తర్వలో అందించనున్నారు. శిబిరాన్ని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించారు. శిబిరంలో వాకతిప్ప పీహెచ్‌సీ అధికారులు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సేవలందించారు.

చట్టాలను అవగాహన చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న సత్యనారాయణ

రామచంద్రపురం: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వొకేట్ దొమ్మలపాటి సత్యనారాయణ అన్నారు. సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవీలత ఆదేశాల మేరకు, పట్టణంలోని మోడరన్ విద్యా సంస్థల్లో వెట్టిచాకిరీ, స్వేచ్ఛ అనే కార్యక్రమంలో భాగంగా ఆయన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత జీవీ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెట్టిచాకిరీకి సంబంధించిన చట్టాలపై విద్యార్థులకు సత్యనారాయణ అవగాహన కల్పించారు.

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం


సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న మోహన్ రాజ్, స్వామిప్రసాద్ తదితరులు

మండపేట: ప్రజా సంక్షేమం కోసం పాటు పడిన మహనీయుడు దామోదరం సంజీవయ్య, ఆయన సేవలు చిరస్మరణీయమని సేవా స్తంభ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్‌రాజు అన్నారు. మాజీ సీఎం, సేవా స్తంభ్ వ్యవస్థాపకుడు సంజీవయ్య జయంతి వారోత్సవాల్లో భాగంగా గురువారం ద్వారపూడి ఇంటిగ్రేటెడ్ వద్ద సేవాస్తంభ్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా శాఖ అధ్యక్షుడు గండి స్వామిప్రసాద్ ఆధ్వర్యంలో సంజీవయ్య జీవిత విశేషాలతో రూపొందించిన పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. తొలుత సంజీవయ్య చిత్రపటానికి మోహన్‌రాజ్, స్వామిప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘ నాయకులు డాక్టర్ మద్దుకూరి సత్యనారాయణ, టి.నరేంద్ర, బి.శాంతకుమారి, కె.కల్యాణి, శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ బి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

153 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం అంగరలో 153 మందిని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌డీ రత్నకుమారి స్థానిక వీవర్స్ కాలనీలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర్ బాలికలను పరీక్షించారు. కదలలేని వృద్ధులు, వికలాంగులకు ఇంటికెళ్లి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి రిపోర్టు ఆధారంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్‌లు పి.సురేష్, టి.మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి, వైద్య ఆరోగ్య, 104 సిబ్బంది, సేవలందించారు.

నిర్మలమైన మనసు ఆమె సొంతం


నిర్మలకుమారి (ఫైల్)

కపిలేశ్వరపురం: మండల మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు కొల్లి నిర్మలకుమారితో కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాల ప్రజలకు ఆత్మీయ అనుబంధం ఉంది. ఆలమూరులో నివాసముంటున్న ఆమె గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. దళిత కుటుంబానికి చెందిన ఆమె రాజకీయ ప్రస్థానం కపిలేశ్వరపురం జెడ్పీటీసీగా ప్రారంభమైంది. 2001 నుంచి 2006 మధ్య కాలంలో జెడ్పీటీసీగా గెలిచి కపిలేశ్వరపురం మండలం నుంచి జిల్లా పరిషత్‌లో ప్రాతినిధ్యం వహిస్తూ అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. భర్త రాజారత్నం దళిత ఉద్యమ కారుడుగానూ, న్యాయవాదిగా నిత్యం ప్రజలతో మమేకమై ఉండేవాడు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి దీర్ఘకాలం పాటు పార్టీలో పని చేశారు. ఆమె మృతికి ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, దళిత సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాజులూరు: కుయ్యేరు 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో పలు గ్రామాల్లో శుక్రవారం తాత్కాలికంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారయణ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ ఈ విషయం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ దుగ్గుదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

20న ఎలుకల మందు పంపిణీ

కె.గంగవరం: మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకే) వద్ద ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని వ్యవసాయాధికారి బి.రవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల వద్ద ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ ఈ పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. మందు కలపడానికి కావాల్సిన నూకలు, నూనెను రైతులు సమకూర్చుకుని, సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

చిల్లర రాజకీయాలనడం సరికాదు

మండపేట: టిడ్కో లబ్ధిదారులు పడుతున్న వెతలు చూసి వారికి వసతులు కల్పించాలని తాను కోరితే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు చిల్లర రాజకీయాలు కనిపించడం సిగ్గుచేటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ తదితర సదుపాయాల కోసం ప్లాట్లు వద్ద లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్సీ తోటకు కనిపించడం లేదన్నారు. పూర్తిస్థాయిలో వసతులు కల్పించి లబ్ధిదారులందరికి ప్లాట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే వేగుళ్ల సూచించారు.